ఘనంగా భోగి

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భోగి పండుగ ఘనంగా జరిగింది. పక్కిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు భోగి కర్రలకు నిప్పంటించి పండగను ప్రారంభించారు. ప్రజలకు భోగ భాగ్యాలు అందాలని ఎమ్మెల్యే శంబంగి కోరారు.

భోగి మంటను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

కొత్త ధాన్యాలతో.. కోడి పందేలతో..

ముగ్గులు వేస్తున్న యువతులు

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద... సరదాలు తెచ్చిందే తుమ్మెద... కొత్తధాన్యాలతో... కోడి పందేలతో...ఊరేగిపోతుంటే... అంటూ సరదాల సంక్రాంతిని వర్ణించాడో కవి. అందుకు తగ్గట్టే నేటి సంక్రాంతి వేళ పల్లెలన్నీ ముస్తాబయ్యాయి. సంక్రాంతి అనగానే పల్లెటూరి వాతావరణం కళ్ల ముందు కదలాడుతుంది. మట్టికి, మనిషికి ఉన్న అన్యోన్య బంధాన్ని గుర్తు చేస్తుంది. జనం సొంత ఊళ్లకు పరుగు పరుగున చేరుకుంటున్నారు. గడిచిన మూడు రోజులుగా బస్సులు, రైళ్లు ఖాళీలేవంటే అతిశయోక్తి కాదు. కరోనా మహమ్మారి ఆగ్రహానికి గడిచిన రెండేళ్లగా పండగ సరదాలు అంతగా లేవు. ఈ ఏడాది ఆర్థిక పరిస్థితులేమీ అంత అనుకూలంగా లేకపోయినప్పటికీ కనీసం ఇంటిల్లపాది కలుసుకుని పండగ నాలుగు రోజులైనా సరదాగా గడుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఇలా వచ్చిన జనంతో పల్లెసీమలు కళకళాడుతున్నాయి. కొన్ని సంస్థలు, కార్యాలయాల్లో వారం రోజుల ముందు నుంచే సంక్రాంతి సందడి మొదలైంది. ప్రభుత్వం తరపున ఒక్క రోజు ముందే (శుక్రవారమే ఉదయమే భోగిమంటలు వేశారు. శిల్పారామంలో సంప్రదాయ వేషధారణ, పాటల కచేరీలు, రకరకాల పండివంటల తయారీతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున జిల్లా అంతటా భోగిమంటలు వెలిగాయి.

బరిలో దిగిన కోళ్లు

గ్రామాల్లో సంక్రాంతి సందడి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పండగ అంటేనే సరదాలు సందళ్లు... అందులో సంక్రాంతి అంటే తెలుగువారింట చెప్పలేనంత అనుభూతి. స్నేహితులు, రక్త సంబంధీకులు అనురాగం, ఆప్యాయం పంచుకునే పర్వదినాలు. అందుకే ఈ పండక్కి నెలరోజుల ముందే.... అంటే నెలగంట పెట్టినప్పటి నుంచీ రోజూ క్రమం తప్పకుండా ఇళ్లు అలుక్కోవడం (శుభ్రం చేసుకోవడం), సున్నాలు వేసి ప్రత్యేకంగా ముస్తాబు చేయడం వంటి పనులు ప్రారంభిస్తారు. రకరకాల పూలు, రంగులతో ఇళ్ల ముందు వేసిన ముగ్గులు హరివిల్లును తలపించేవి. గొబ్బెమ్మలు పెడుతూ యువతంతా ఆటపాటలతో అలికిరి చేసేవారు. బుడబుక్కల వాళ్లు, హరిదాసులు, కొమ్మ దాసులు, జంగందేవర్లు.... కళలను ప్రదర్శించేవారు. పండగకు కొద్దిరోజుల ముందునుంచే పిండివంటకాలు ఘుమఘుమ లాడేవి. నూతన వస్త్రాలు, కిరాణా సామగ్రి తదితర సరుకుల క్రయ విక్రయాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కళకళలాడేది. బట్టల వ్యాపారులు సైకిళ్లపై గ్రామగ్రామాల్లో తిరిగి విక్రయించేవారు. ఇలా గ్రామసీమలు కళకళలాడేవి. ఇదంతా ఒకప్పటి మాట. నేడు ఆ పరిస్థితులు మారాయి.

మారుతున్న పరిస్థితులు నాటి సంస్కృతి సంప్రదాయాలను కనుమరుగు చేస్తున్నాయి. ఏటా పండగ తీరుమారు తుండడమే ఇందుకు నిదర్శనం. గంగిరెద్దులు, హరిదాసులు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతున్నా మునుపటి ఉత్సాహం వారిలో కనిపించడం లేదు.

పండగలు... ఉత్సవాలు... జాతరలు... మానవ సంస్కృతిలో భాగం. కొన్ని పండగలు ఉత్పత్తితో ముడిపడి ఉంటాయి. మరికొన్ని ప్రకృతిపై మానవుడు సాధించిన విజయాలకు చిహ్నంగా నిలుస్తాయి. ఇంకొన్ని పూర్తిగా కుల, మత నమ్మకాలపై ఆధారపడి ఉంటాయి. ఇందులో మొదటి కోవకు చెందిందే సంక్రాంతి పండగ. జిల్లాలోని 70శాతం కుటుంబాలు వ్యవసాయంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ముడిపడి ఉన్నవే. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో ఎక్కువ ప్రాంతాల్లో పంటలు మంచి దిగుబడి వచ్చాయి. కానీ, వాటికి మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో రైతుల ఇబ్బందులు ఎప్పటి మాదిరిగానే ఉన్నాయి. పండక్కి పక్షం రోజుల ముందే ధాన్యం, ఇతరత్రా వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించి, కొత్తబట్టలు, సంక్రాంతి సరుకులు కొనుక్కునే నాటి పరిస్థితులు నేడు పూర్తిగా తలకిందులయ్యాయి. ధాన్యం సకాలంలో కొనుగోలు చేయక, కొనుగోలు పేరుతో జరుగుతున్న దోపిడీ, బిల్లులు సకాలంలో చెల్లించక ఆర్థిక ఇబ్బందులతో సతమత మౌతున్నారు. చెరకు రైతులదీ అదే పరిస్థితి. రైతాంగం వీటన్నింటిని దిగుమింగుతునే సంక్రాంతి సరదాలకు సిద్ధమైంది.

హరిదాసుకు దానం చేస్తున్న చిన్నారులు

సంక్రాంతి సందడి

మార్కెట్ కిటకిట

జనాలతో కిటకిటలాడుతున్న ఎంజి రోడ్డు

ప్రజాశక్తి - విజయనగరంటౌన్, కోట

సంక్రాంతి నేపథ్యంలో విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, ఎస్.కోట, సాలూరు, చీపురుపల్లి, గజపతినగరం పట్టణాలు జనాలతో కిక్కిరిసి పోయాయి. ప్రధానంగా విజయనగరంలోని గంటస్తంభం, పిడబ్ల్యుమార్కెట్, కన్యకాపరమేశ్వరి ఆలయం రోడ్డు, బాలాజీ మార్కెట్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఆర్‌టిసి కాంప్లెక్సు, మున్సిపల్ మార్కెట్ కొనుగోలుదారులతో నిండిపోయాయి. ఉదయాన్నే భోగిమంటలు వేసుకుని, తర్వాత నగరానికి గ్రామాల నుంచి సరుకుల కోసం రావడంతో ఊకపోస్తే రాలనంత జనంతో సందడి నెలకొంది. ఉదయం 10గంటల నుంచే సరుకులు, నూతన వస్త్రాలను కొనేవారితో కిటకిటలాడింది. సంక్రాంతి రోజున పెద్దలకు నూతన వస్త్రాలను చూపించడంతోపాటు, నైవేద్యాలు, పండిన తొలి పంటను పెట్టి పూజలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న వారు వారి సొంతూళ్లకు చేరుకుంటుండడం, పనిలో పనిగా అవసరమైన దుస్తులు, సామగ్రి కొంటుండడంతో నగరమంతా జనమే కనిపించారు. పండగకు పిండి వంటల కోసం సరుకులతో పాటు కొత్తబట్టలు కొనుగోలు చేయడంతో ఆయా దుకాణాలు కిటకిటలాడాయి.

పండగ సామగ్రి తీసుకెళ్తున్న మహిళలు

బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పెద్దమార్కెట్

పండగ పూట విషాదం

- రేగలో 13 పూరిళ్లు దగ్ధం
- రూ. 30 లక్షలు ఆస్తి నష్టం
- కట్టుబట్టలతో మిగిలిన బాధితులు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రేగ గ్రామ పంచాయతీలో శనివారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో 13 పూరిళ్లు దగ్ధమయ్యాయి. రూ 30 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. 13 కుటుంబాలకు చెందిన 55 మంది కట్టు బట్టలతో మిగిలారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ఈ పమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో దమ్ము అచ్చియమ్మ , బత్తిన అప్పలనరస, సిమ్మ రాము , బి.ముత్యాలమ్మ , ఎన్.ఆచారి , కె.పైడమ్మ , ఎస్.ఆదినారాయణ , ఎన్ .ప్రసాద్ , పి.నీలకంఠం , రావాడ జోగినాయుడు , బి.కనకరాజు , బి.బంగారమ్మ లకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎంపిటిసి సభ్యుడు బొడ్డు గణపతి ఇచ్చిన సమాచారం మేరకు కొత్తవలస అగ్నిమాపక వాహనం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఎఫ్ఒ వై.అశోక్ కుమార్ , సిబ్బంది మంటలను అదుపు చేశారు. స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు బాధితులకు రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతోపాటు వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్) , తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ రూ.10 వేలు చొప్పున ఆర్థికంగా సాయం అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులందరికీ ప్రభుత్వపరంగా ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు కోరారు. బాధితులందరికీ ప్రభుత్వమే పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భోగి మంటల్లో జిఒ 1 కాపీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబర్ ఒకటిని రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయొద్దని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యాన శనివారం జిఒ 1 కాపీని భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రుద్రప్రసాద్ మాట్లాడుతూ లక్షలాది మంది కార్మికులకు ఉపాధిగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తగదని, సొంత గనులును ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరంకుశత్వంగా తీసుకొచ్చిన జీవో 1ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గజపతినగరం మండల కమిటీ సభ్యులు గణేష్ చెందు, రాంబాబు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : జిఒ 1ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జరజాపుపేటలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిఒ 1 కాపీలను భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలను అణగదొక్కడానికి ప్రభుత్వం జిఒ నంబర్ 1ని తీసుకురావడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరికీ సభలు, సమావేశాలు పెట్టుకునే హక్కు ఉందని తెలిపారు. జిఒ ఒకటిని రద్దు చేయకుంటే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తాలాడ సన్నిబాబు, మద్దిల రాము, బి.కృష్ణమూర్తి, సుంకర పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సభలు, సమావేశాలు, ర్యాలీలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ ఒకటిని రద్దు చేయాలని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన డిమాండ్ చేశారు. జిఒ ఒకటి ప్రతులను శనివారం భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంపై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతుందన్నారు. వ్యతిరేకత పెరగడంతో ప్రజలు, కార్మికులు, రైతులు రోడ్లపైకి వస్తున్నారని చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబు సభలకు భారీగా జనం వస్తున్నారని, అది చూసి ఓర్వలేకనే వైసిపి ప్రభుత్వం జిఒ ఒకటి తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. జిఒ ఒకటిని రద్దు చేయాలని, లేకుంటే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

విజయనగరం, నెల్లిమర్లలో భోగి మంటల్లో జిఒ 1 ప్రతులను వేసి దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొబ్బిలి.. జిఒ ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న సుజయకృష్ణ, బేబినాయన

రోడ్డు పన్ను పెంపు ఉత్తర్వులు రద్దు చేయాలి

ప్రజాశక్తి-పాలకొండ

సరుకు రవాణా, ప్రజారవాణా వాహనాలపై రాష్ట్ర ప్రభుత్వం పెంచిన త్రైమాసిక రోడ్డు పన్ను ఉత్తర్వులను రద్దుచేయాలని కోరుతూ శనివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఆటోస్టాండ్ వద్ద ఆటో కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ వెంటనే ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తీవ్ర సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న రవాణా రంగంపై త్రైమాసిక రోడ్డు పన్ను పెంచి మరోసారి భారాలు వేయడం సరికాదన్నారు. కోవిడ్ అనంతరం కాలంలో పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోకుండా రహదారుల మరమ్మతుల పేరుతో ఆయిల్‌పై ఒక్కో రూపాయి చెస్ విధించడం అన్యాయమన్నారు. ఎక్కడ కూడా రోడ్లు మరమ్మతులు చేపట్టిన దాఖలాల్లేవన్నారు. పొరుగు రాష్ట్రాల్లో నాలుగు త్రైమాసికాల పన్నులు రద్దు చేయగా ఎపిలో మాత్రం ఒక్కరూపాయి కూడా వదిలిపెట్టలేదన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టాభి, బి.త్రినాథ్, సత్యం, సింహాచలం, రామకృష్ణ, నీలకంఠం, నందు తదితరులున్నారు.

యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు యూనిఫాం, సబ్బులు, నూనెను మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అందజేశారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 630 మంది కార్మికులకు వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సేవలను గుర్తించి వారికి అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. నగర పారిశుధ్యంలో కార్మికులదే అగ్రభాగమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సేవలను మరింత విస్తృత పరచాలని కోరారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివన్నారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలు అందరూ గుర్తించి గౌరవించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ప్రజారోగ్య విభాగం సిబ్బంది గాంధీ, బాలకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు యూనిఫాం, సామగ్రి అందిస్తున్న మేయర్

ఉపాధ్యాయ ఉద్యమ నేత

యుఎ నర్సింహం మృతి

నివాళులర్పించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, ఆపస్ రాష్ట్ర మాజీ నాయకులు యుఎ నర్సింహం శనివారం తెల్లవారు జామున విజయనగరంలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నర్సింహం మరణ వార్త తెలిసిన వెంటనే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగా ఢ సానుభూతిని తెలియజేశారు. తన సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఇచ్చే ప్రతిభ పురస్కారాలకు గాను , విద్యా కమిటీకి మాస్టారు చైర్మన్‌గా ఉంటూ ఎనలేని సేవలు అందించారని అన్నారు. మాస్టారి మరణం ఉపాధ్యాయులకే కాకుండా, తనకు వ్యక్తిగతంగా తీరనిలోటు అని అన్నారు. 1932లో సింహాచలంలో జన్మించిన యుఎ నర్సింహం 1953లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. నెల్లిమర్ల, ఎస్.కోట, పూసపాటిరేగ, వియ్యంపేట, రామ తీర్థాలులో పనిచేసి 1990లో ఉద్యోగ విరమణ చేశారు. 1983 సెప్టెంబర్ 5న ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా విశిష్ట పురస్కారం అందుకున్నారు. 1984 సెప్టెంబర్ 5న జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అప్పటి రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యాయ బంధుగా పిలవబడే మాస్టారు ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడంలో వారధిగా నిలిచారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో రెండుసార్లు పోటీ చేశారు. మాస్టారు మరణ వార్త తెలియగానే నగరానికి చెందిన ప్రముఖులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తరలివచ్చి ఆయనకు ఘన నివాళులర్పించారు. మాస్టారు భౌతికాయానికి దాసన్నపేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

యుఎ నర్సింహం

ప్రయివేటుపై ఉన్న ప్రేమ ప్రభుత్వరంగంపై ఏదీ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రజల్ని ఏలేందుకు పదవి కావాలి. కానీ, అదే ప్రజలకు ఉపాధి, ఉద్యోగాలు అవకాశాలు కల్పించే బాధ్యత అక్కర్లేదు. అధికారం కావాలి. కానీ, దాన్ని ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగించాలన్న జిజ్ఞాస లేదు. సహజ వనరులను స్థానికంగా ఉపయోగించాలన్న ఆత్రుత అసలే లేదు. ఇదీ జిల్లాలో మైనింగ్‌పై అటు ప్రభుత్వంగానీ, పాలకులుగానీ అనుసరిస్తున్న తీరు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అత్యంత విలువైన మాంగనీస్, మెటల్, గ్రావెల్, ఇసుక తదితర గనులు పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా విజయనగరం జిల్లా గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం, నెల్లిమర్ల, రాజాం, తెర్లాం మండలాలు మాంగనీస్ గనులకు పెట్టింది పేరు. అత్యంత నాణ్యమైన ఖరీదైన గనులు ఈ మండలాల్లో ఉన్నాయి. ఎస్.కోట, గజపతినగరం తదితర నియోకవర్గాల్లో మెటల్, గ్రావెల్, నాగవళి, గోస్తనీ, చంపావతి, సువర్ణముఖి తదితర నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక ఖనిజాలు ఉన్నాయి. వీటి విక్రయం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం వస్తోంది. కానీ, ఇదే ఖనిజ సంపదను స్థానికంగా ఉపయోగిస్తే వెనుకబడ్డ విజయనగరం, పార్వతీపురం జిల్లాలో ఎంతో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా మాంగనీస్ గనులను ఉపయోగించుకుని జిల్లాలో ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఉన్న పరిశ్రమలకు కూడా ఇక్కడి గనులను కేటాయిస్తే ఉపాధి మరింత మెగుపడేందుకు అవకాశం ఉంది. కానీ, పాలకులుగానీ, ఇరు జిల్లాలకు చెందిన అమాత్యులుగానీ ఆదిశగా ప్రయత్నించడం లేదు. ఈ ప్రాంతంలోని మాంగనీస్ అత్యంత నాణ్యతగా ఉండడంతో సెయిల్, గెయిల్ వంటి ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్లకు కేటాయించాలన్న ఆలోచనను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకున్నాయి. పైగా మాంగనీస్‌ను లీజు పద్ధతిలో ఎలాగైనా పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు మైనింగ్ పాలసీని మరింత సులభతరం చేసింది. ఎపి ఎంఎంసి (ఆంధ్రప్రదేశ్ మైనర్ మినరల్ కనస్ట్రక్షన్) 1966ను సరళతరం చేసి, 2022 మార్చి 14న ఎపి ఎంఎంఎఆర్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా జిఒ నెంబర్ 30, 14లను తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే విజయనగరం జిల్లాలోని వివిధ మండలాల్లోవున్న మాంగనీస్ గనులను వివిధ ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టింది. 56లక్షల మెట్రిక్ టన్నులు మాంగనీస్ గల గిరివిడి మండలం దేవాడ బ్లాక్‌ను మహాలక్ష్మి మినరల్స్ అనే ప్రైవేట్ కంపెనీ దక్కించుకుంది. జిల్లాలోని సుమారు 19మాంగనీస్ బ్లాకులను ఆర్‌బిఎస్ఎస్‌డి-2, మోర్ ఎల్లాయీస్ వంటి కంపెనీలు దక్కించుకున్నట్టు సమాచారం. గరిడివి మండలం దేవాడ బ్లాక్ తవ్వకాల విషయమై గత ఏడాది నవంబర్ 22న కొండపాలెం బ్లాక్ తవ్వకాలకు డిసెంబర్ 21న అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా అత్యంత వెనుకబడి ఉన్నందున స్టీల్, ఫెర్రో ఎల్లాయీస్ వంటి పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటుచేసి, వాటికి స్థానికంగావున్న మాంగనీస్ గనులను కేటాయించాలని ఈ గ్రామాల్లోని ప్రజలు, కార్మికులు డిమాండ్ చేశారు. నివాసాలకు కేవలం 500మీటర్ల దూరంలో తవ్వకాలు చేపడితే కాలుష్య సమస్య ఎదుర్కోవాల్సివస్తుందని, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతాయని కూడా స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని అధికారులు చెప్పినప్పటికీ ఆచరణలో అటువంటి చర్యలేవీ కనిపించడం లేదు. మరోవైపు తవ్వకాలకు అనుమతులు చకచకా ఇచ్చేస్తున్నారు. దీంతో, ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఇంకోవైపు అరుదైన మాంగనీస్ గనులు ప్రైవేటు పరం కావడంతో ఉపాధి మార్గాలు కనిపించడం లేదు. ఈనేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలుగానీ, ప్రభుత్వంగానీ పెట్టుబడిదారుల లాభాల కోసం తప్ప, ప్రభుత్వ రంగంలో మాంగనీస్ పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలన్న చిత్తశుద్ధి లేదని పలువురు విమర్శిస్తున్నారు.



రక్తదానం చేస్తున్న సాధన యువజన సంఘం సభ్యులు

మానవత్వం చాటుకున్న 'సాధన'

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అత్యవసర పరిస్థితుల్లో సాధన యువజన సంఘం సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. జరజాపుపేటకు చెందిన కిడ్నీ రోగి కనకల రాజారావుకు ఎబి పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో సాధన యువజన సంఘాన్ని సంప్రదించారు. సాధన మిత్ర బృందంలో ఎబి పాజిటివ్ గ్రూపునకు చెందిన కాళ్ల లక్ష్మీనారాయణ, గర్భాపు శ్రీనుకు ఈ విషయం తెలియజేశారు. వెంటనే విజయనగరం ఎన్‌విన్ బ్లడ్ బ్యాంకు వారిద్దరు వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకు ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు, మాతృభూమి సేవా సంఘం ఇప్పలవలస గోపాలరావు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో కాళ్ల లక్ష్మీనారాయణ 11 సార్లు, గర్భాపు శ్రీను 17 సార్లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

సైకిళ్లను పంపిణీ చేస్తున్న డిఎస్‌పి మోహనరావు, తూముల భాస్కరరావు, జెసి రాజు

చదువుతోనే బంగారు భవిష్యత్తు

డిఎస్‌పి మోహన్ రావు

ప్రజాశక్తి-బొబ్బిలి

చదువుతోనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని డిఎస్‌పి మోహనరావు తెలిపారు. శనివారం స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రోటరీ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజోపయోగకరంగా ఉంటున్నాయన్నారు. రోటరీ అంటే సేవ అనేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక సంఘ మాజీ సభ్యులు తూముల భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ పూర్తయి ఫార్మసీ చేయాలని ఆసక్తి ఉన్న బాలికలకు లోకబంధు ఫార్మసీ విద్యాసంస్థల్లో ఉచితంగా చదువుకునే వెసులుబాటును రోటరీ ద్వారా కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ఇమాజిన్‌లో భాగంగా 21 మంది బాలికలకు లక్షా 26 వేలు విలువైన 21 సైకిళ్లను డిఎస్‌పి మోహనరావు, భాస్కరరావు, తూముల కార్తిక్, జెసి రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి శ్రీహరి, పోలియో చైర్ ఎస్.అప్పలరాజు, కారుణ్య ఫౌండేషన్ చీఫ్ ఆర్గనైజర్ డేవిడ్ జె విక్టర్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణ, బి.లక్ష్మణరావు, శంకరరావు పాల్గొన్నారు.

రెండో ఎంఇఒ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యా శాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా మంజూరు చేసిన 692 మండల విద్యాశాఖాధికారి పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జిఒ 154 ప్రకారం ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఈ పోస్టులపై ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఇఒ సంఘం తమకు అనుకూలంగా లేదని ఈ జీవోను రద్దు చేయమని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిందని అన్నారు. కానీ తదుపరి ఆలోచించుకొని వేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరణ చేసుకున్నట్టుగా సమాచారం తెలుస్తోందన్నారు. కావున ముఖ్యమంత్రి ఆలోచన ప్రకారం కొత్తగా సృష్టించిన అదనపు 692 మండల విద్యాశాఖాధికారి పోస్టులను (ఎంఈఓ- 2) భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని సామల తెలిపారు. ఇందుకుగాను జాప్యం లేకుండా జీవో 154 ప్రకారం ఎంఇఒ పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్ చార్ట్, విధి విధానాలను తక్షణమే రూపొందించి, ముఖ్యమంత్రి ఆలోచనకు కార్యరూపం ఇవ్వాలని, ఇందుకు విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సామల విజ్ఞప్తి చేశారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి - సీతానగరం

మైనర్ బాలురులు వాహనాలు నడపొద్దని ఎస్సై కె.నీలకంఠం అన్నారు. శనివారం హనుమాన్ జంక్షన్‌లో అవగాహన సదస్సు జరిగింది. ప్రధానంగా మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై వారి తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వాసుదేవనాయుడు, తిరుపతిరావు, రామకృష్ణ, సత్యనారాయణ, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలన అంతంతోనే ప్రజలకు సుఖం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రజల ప్రాథమిక హక్కులను హరించేలా రాష్ట్రంలో కొనసాగుతున్న సైకోపాలన అంతమైతేగానీ రాష్ట్ర కష్టాలు సుఖాంతమవ్వవని టిడిపి నాయకులు అన్నారు. మండలంతో పాటుగా పట్టణంలో పలు చోట్ల శనివారం టిడిపి నాయకులు జిఒ. 1 ప్రతులను భోగీ మంటల్లో వేసి దగ్ధం చేశారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే ప్రభుత్వాన్ని కొనసాగిస్తే రాజ్యాంగానికి విలువ, గౌరవం లేకపోవడమే కాకుండా, పౌరహక్కులకు తీవ్రమైన విఘాతం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నియంతపాలన పోవాలంటే తెలుగుదేశాన్ని ప్రతిఒక్కరూ బలపరచాలని కోరారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహన్, జి.రవికుమార్, నాయకులు జి.వెంకటనాయుడు, బిచంద్రమౌళి, జాగాన రవికుమార్, కెంగువ ప్రదీప్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రోజువారీగా గుమ్మలక్ష్మీపురంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ శ్రమ జీవులుగా బతుకుతున్న పలువురు గ్రీన్ అంబాసిడర్లకు సంక్రాంతి సందర్భంగా సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, స్థానిక స్వాతి రెడీమేడ్ షాపు యజమాని కొనిస సూర్యం నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీశంకర్ మాట్లాడుతూ ఎండనకా వాననకా నిత్యం గ్రామాన్ని పారిశుధ్య వాతావరణంలో ఉంచుతూ గ్రీన్ అంబాసిడర్ల కష్టాలను గుర్తించి స్వాతి రెడీమేడ్ సభ్యులు వస్త్రాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, కొనిస సూర్యం పారిశుధ్య కార్మికులకు పండగ ఖర్చుల నిమిత్తం కొంత నగదును ఆర్థిక సాయం చేశారు. దీంతో పారిశుధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయం కార్యదర్శి కిషోర్, ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్ ఉన్నారు.

దారులన్నీ పల్లెల వైపే..

కిటకిటలాడుతున్న బస్టాండ్, రైల్వేస్టేషన్లు • సంక్రాంతి సందడిలో జనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, డెంకాడ

పల్లెకు పండగొచ్చేసింది.. అన్నిదారులూ పల్లెల వైపే కదులుతున్నాయి.. ఎటు చూసినా సంక్రాంతి పండక్కి సొంతూరు వెళ్లాలన్న ఉత్సాహం ఉరకలేస్తోంది.. చిన్ననాటి స్నేహితులను, బంధువులను కలుసుకోవాలన్న ఆత్రుత అందరిలోనూ కనిపిస్తోంది. అదే స్థాయిలో స్వాగతం చెప్పేందుకు పల్లెటూళ్లు ఎదురు చూస్తున్నాయి. సంక్రాంతి సంబరాలకు పల్లెవాకిలి సర్వం సిద్ధమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్రాంతి పల్లెల్లో కాంతులు నింపేందుకు సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లే జనాలు, వాహనాలతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. పాఠశాలలకు నిన్నగాక మొన్న (గురువారం)టి నుంచే సంక్రాంతి శెలవులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఉద్యోగాలు, ఉపాధి, చదువు తదితర వాటి కోసం ఎక్కడెక్కడో ఉన్నవారంతా సంక్రాంతి పండగ నేపథ్యంలో స్వగ్రామాలకు పయనమయ్యారు.

టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

దీంతో, విజయనగరం ఆర్టీసి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ కిటకిటలాడుతున్నాయి. తెలుగువారు అత్యంత వైభవంగా జరుపుకునే అతిపెద్ద పండగల్లో సంక్రాంతి ఒక్కటే. ఏడాదికొకసారైనా తమ పెద్దలను కొలుచుకునేందుకు తమ సొంతూళ్లకు వస్తుంటారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వేలాది మంది విశాఖ, హైదరాబాద్, చెన్నై, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో వివిధ రకాల ఉపాధి పొందుతున్నారు. వారే కాకుండా పలుచోట్ల ఉద్యోగ రీత్యా స్థిరపడిన వారూ సంక్రాంతికి వస్తున్నారు. రెండు జిల్లాల కేంద్రాల్లోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కూడా పల్లెకు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్ వేలాది మంది కిక్కిరిసిపోయాయి.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులను జిల్లా ఎస్‌పి ఎం.దీపిక భాగస్వామ్యులను చేసి, నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, ఆయన సతీమణి శ్వేత హరికష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్వేత హరికృష్ణ మాట్లాడుతూ - సంక్రాంతి పండగను పోలీసు కుటుంబాలతో కలిసి ఒకే వేదిక మీద జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇకపై కూడా ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. ఎస్‌పి ఎం.దీపిక మాట్లాడుతూ ఐపిఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషను ఆధ్వర్యంలో ప్రతీ జిల్లాలో సంక్రాంతి సంబరాలను నిర్వహించాలని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసులు, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పోలీసు కుటుంబాల మహిళలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంబరాల్లో హరిదాసు కీర్తనలు, బసవన్న విన్యాసాలు, కోలాటప్రదర్శన, సంగీత దర్శకులు భీష్మ ఆధ్వర్యంలో బృందం ఆలపించిన సంక్రాంతి గీతాలు అందరిని ఎంతగానో అలరించాయి. పోలీసు పిల్లలు గాలి పటాలు ఎగురవేసి, స్కై లాంతర్లు వెలిగించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సంబరాల్లో ఎస్ఇబి అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎం.ఎం. సోల్మన్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

భోగి మంటను వెలిగిస్తున్న ఎస్‌పి దీపిక

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యాన భోగి

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యాన శనివారం పాఠశాల క్రీడా మైదానంలో భోగి సంబరాలు వేడుకగా జరిగాయి. గత 20ఏళ్లుగా పూర్వ విద్యార్థులు ఏటా భోగి సంబరాలు నిర్వహించి ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగ రీత్యా ఉంటున్న సీనియర్స్, జూనియర్స్ పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో భోగి సంబరాల్లో పాల్గొన్నారు. దీంతో క్రీడా మైదానంలో సందడి నెలకొంది. ప్రతి బ్యాచ్ విద్యార్థులు తమ క్లాస్మెట్స్‌ను ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనాటి పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. తమ పిల్లలతో భోగి మంటల చుట్టూ ఆట పాటలతో ఆనంద భరితులయ్యారు. అనంతరం నాటి ప్రధానోపాధ్యాయులు అల్లు అప్పలస్వామి, ఉపాధ్యాయులు మగ్రాపు వేణు, క్రీడా గురువు కర్రి అప్పారావు కెఎన్ఎం శర్మ, ఆగూరి ఆచారిలను ఘనంగా సత్కరించారు. వారి అంకిత భావాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం కాసేపు పోటా పోటీగా ఆడుతూ చిన్న పిల్లల్లా మారిపోయారు.

ప్రజా సేవే లక్ష్యం

15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు : ఎన్‌ఆర్‌ఐ గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

ప్రజా సేవ లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఎన్‌ఆర్ఐ, టిడిపి నాయకులు గొంప కృష్ణ వెల్లడించారు. 15 ఏళ్లుగా శృంగవరపుకోట నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని, ఇకపైనా కొనసాగిస్తానని చెప్పారు. శనివారం మండలంలోని కృష్ణరాయుడు పేటలోని తన నివాసంలో 'ప్రజాశక్తి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. చినప్పటి నుంచి రైతు కుటుంబాల్లో కష్టాలన్నీ స్వయంగా చూశానని తెలిపారు. విద్య ప్రాధాన్యత తెలిసివాడినని, చదువులో రాణిస్తేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని చెప్పారు. అందుకే రైతులకు, విద్యార్థులకు సాయం చేయడంలో ముందుంటానని వివరించారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని పేర్కొన్నారు. స్థానిక నాయకుల సూచనల మేరకు విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్లు, ఫర్నీచర్ అందిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు వ్యవసాయం చేస్తున్న రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నానని చెప్పారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యం కోసం అవసరమగు స్థల సేకరణ కూడా చేస్తున్నట్లు వివరించారు. బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం, కెజిబివి, ఎపి ఆదర్శ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం సోలార్ దీపాలు, బాలికలకు ప్రత్యేకంగా డిజిటల్ కంప్యూటర్ రూమ్ ఏర్పాటు చేస్తానని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమయ్యే మెటీరియల్ అందజేస్తానని తెలిపారు. స్థానిక నాయకుల సలహా మేరకు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో పాల్గొంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమానికి మహిళలతోపాటు యువత నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గ్రామస్థాయిలో టిడిపిపై ఉన్న నమ్మకమే అందుకు నిదర్శనమని తెలిపారు. నిన్న గాక మొన్న వచ్చిన ఎన్‌ఆర్ఐ కృష్ణ వల్ల నియోజకవర్గంలో పార్టీకి నష్టం వాటిల్లుతుందని కొంతమంది వారి స్వార్థం కోసం ప్రచారం చేసుకుంటున్నారు తప్ప అందులో వాస్తవం లేదన్నారు. నిన్న, మొన్న వచ్చిన ఎన్‌ఆర్‌ఐని కాదని, 15 ఏళ్ల నుంచి పార్టీ అధినేత సూచనలతో ప్రజా సేవ చేస్తున్నానని వెల్లడించారు. అందులో ఏమాత్రమూ సందేహం అక్కర్లేదని తెగేసిచెప్పారు. పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేయడమే తన ముందున్న లక్ష్యమని స్పష్టంచేశారు. నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తీసుకొస్తానని వెల్లడించారు.

భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలు

మేయర్ విజయలక్ష్మి

విజయనగరంటౌన్.. గాలిపటాలను పంపిణీ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని మేయర్ విజయలక్ష్మి అన్నారు. భోగి సందర్భంగా షాదీ ఖానా వద్ద పిల్లలకు వైసిపి నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు సమకూర్చిన గాలిపటాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి అని, ఈ పర్వదినాలలో అన్ని కుటుంబాలు సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పర్వదినాలలో అనాదిగా వస్తున్న సంప్రదాయాలు అనేకం ఉన్నాయన్నారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేయడంలో ఉన్న ఆనందం ఆకాశమంత ఎత్తులో ఉంటుందన్నారు. పాశ్చాత్య పోకడలు పెచ్చుమీరుతున్న తరుణంలో సంప్రదాయాలను మరిచిపోకూడదన్న ఉద్దేశంతో శ్రీనివాసరావు సొంత నిధులతో గాలిపటాలను సమకూర్చి పిల్లలకు అందించడం ఆనందంగా ఉందన్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సంక్రాంతి నేపథ్యంలో మదర్ థెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ , మదర్ థెరిసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా నిరుపేదలకు శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సంఘం అధ్యక్షులు, ఫౌండర్ త్యాడ ప్రసాద్ పట్నాయక్, సంఘ సభ్యులు శ్రీనివాస్, శివదీప్, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

బొబ్బిలి : మండలంలోని రామన్నదొరవలస గ్రామంలో శనివారం గాంధీ స్మారకనిధి సంస్థ అధ్యక్షులు ఎం.విజయమోహనరావు గిరిజనులకు దుస్తులు పంపిణీచేశారు. కార్యక్రమంలో పల్లా సత్యనారాయణ, టి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి.. దుస్తులు పంపిణీ చేస్తున్న విజయమోహనరావు

విజయనగరంటౌన్.. నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మదర్‌థెరిసా సేవా సంఘం

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఏజెన్సీలో అధికంగా టేకు, పనస, గుగ్గులం, ఏగేసి మద్దిస కలపను స్మగ్లర్లు అక్రమంగా నరికి దోచుకుపోతున్నారు. మండలంలో చిన్నబగ్గ, పూతికవలస, పొల్ల దోనుబాయి, శంభాం, కడగండి తదితర ప్రాంతాల నుంచి కలపను స్మగ్లర్లు యథేచ్ఛగా రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా చేసినప్పటికీ అటవీ శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికంగా రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, పికప్ వాహనలతో రవాణా చేస్తున్నారు. నేరుగా ఇవి ఒడిశాలోని పర్లాకిమిడి వెళు తున్నాయి. ఇక పండగ సీజన్‌లో అయితే సిబ్బంది పండగ సీజన్లో నిమగ్నమైతే కలప స్మగ్లర్లకు ఇదే అదును చేసుకొని ఎక్కువగా కలపను తరలించుకుపోతున్నారు. వర్షాకాలంలో తుఫాన్‌లో కూడా అదే ఆసరాగా తీసుకొని నేలకు ఒరిగిన చెట్లతో పాటు బతికున్న చెట్లు కూడా నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో కలప అధికంగా సేవ ఉంటుందని పట్టణవాసులు ఇష్టపడతారు. మన్యం ప్రాంతం నుండి కలప కొత్తూరు, రొట్టవలస, ఆముదాలవలస, రాజాం, పాలకొండ మిల్లులకు తరలిపోతుంది. సీతంపేట ఏజెన్సీలో అక్రమ కలప నివారించడానికి ఏర్పాటు చేసిన బేస్ క్యాంపుల్లో అధికారులు, సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి అడవులను రక్షించాలని గిరిజనులు కోరుతున్నారు.

కనుల పండువగా గోదాదేవి కళ్యాణం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని ఆరికతోట బిసి కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా దేవి కళ్యాణం శనివారం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చిలుకూరి రవిశర్మ ఆధ్వర్యంలో ఈ కళ్యాణం నిర్వహించారు. గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. బూసాయవలస కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ గోదాదేవి కళ్యాణం నిర్వహించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన సర్పంచ్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరు గ్రామంలో ఆదివారం జనార్దనస్వామి ఆలయానికి గ్రామ సర్పంచ్ కె.వెంకటలక్ష్మి, రమణమూర్తి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఏటా భోగి సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని సర్పంచ్ తెలిపారు.

సమాజ సేవకునికి సత్కారం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, వృద్ధ మిత్ర కో- ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి తన జీతంలో కొంత నిధులను వెచ్చించి పేదలకు, వృద్ధులకు, వికలాంగులకు పేద విద్యార్థులకు ప్రతినెలా చేసిన సేవలకు మెచ్చి పట్టణ శివారులో ఉన్న మూడో వార్డు వివేకానంద కాలనీకి చెందిన రగుమండల సత్యనారాయణ, ఇసకల ఉదయ్ కుమార్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ సురేష్, ట్రాఫిక్ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది సమక్షంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదుటివారి కష్టాల్లో ఉన్నప్పుడు వారి బాధలను గుర్తించి అన్ని విధాలా సహాయం అందిస్తున్న కృష్ణమూర్తి అందరికీ ఆదర్శమని కొనియాడారు.

వృద్ధులను సన్మానిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

కొంపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి వేపాడ

మండలంలోని కొంపల్లిలో శనివారం డెక్క బొమ్మనాయుడు, దొగ్గ శ్రీరాములునాయుడు జ్ఞాపకార్థం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, డి.శ్రీనివాసరావు భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శతాధిక వృద్ధులను సన్మానించారు. కోలాటం, భజన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

పండగ వేళ అప్రమత్తం : ఎస్ఐ

ప్రజాశక్తి - వీరఘట్టం

సంక్రాంతి పండుగ సందర్భంగా పోలీసులిచ్చిన సలహాలు, సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఎస్సై ఎం.హరికృష్ణ ప్రజలకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సెలవులు కావడంతో ప్రజలంతా తమ సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్తున్నారన్నారు. ఇటువంటి సమయంలో ఎవరు కూడా వారి ఇళ్లల్లో విలువైన ఆభరణాలు విడిచి వెళ్లరాదని, ఒకవేళ విడిచినచో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అందరూ సొంత గ్రామాలకు వెళ్లేవారు ఎక్కువగా ఉండే రోడ్లు ఎక్కువగా రద్దీగా ఉండటం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలు చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపిన వారు తప్పనిసరిగా హెల్మెంట్లు ధరించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడి, గొర్రెపోతు పందాలతో పాటు పేకాట ఆడరాదునిస్పష్టం చేశారు.

మంచు దుప్పటిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం

నగరంపై మంచు దుప్పటి

- ఉదయం 8 గంటలైనా వీడని మంచు
- లైట్లతో నడిచిన వాహనాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శనివారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 5 గంటల నుంచి మంచు విపరీతంగా పడడంతో నగర ప్రజలు తడిచి ముద్దయ్యారు. ఉదయం 8గంటలైనా మంచు దుప్పటి తొలగక పోవడంతో వాహనాలు లైట్లు వేసుకుంటూ నడిచాయి. మంచు కారణంగా ముందు వెళుతున్న వాహనాలు, పాదచారులు సైతం కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహన దారులు కొంచెం ఇబ్బంది పడ్డారు. మంచు కురుస్తుండటంతో నగర వాసులు భోగి మంటల్లో చలి కాచుకొని ఉపశమనం పొందారు.

లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్న వాహనాలు